మట్టి రోడ్లు, దెబ్బతిన్న డ్రెయినేజీలు

- హనుమాన్‌తండాలో కమ్ముకున్న ఇటుక బట్టీల పొగ
- పట్టణానికి విసిరేసినట్టున్న ఎర్రవల్లి తండా
- దొడ్డలోనిపల్లిలో మురుగుమయం

వార్డు నం.17
జనాభా: 5,597
ప్రధాన వీధులు: దొడ్డలోనిపల్లి, కోయనగర్, సత్యమన్నకాలనీ, ఎర్రవల్లితండా, హనుమాన్‌తండా.


దొడ్డలోనిపల్లిలో మసీదు పక్కన ఏరులై పారుతున్న మురుగు


సత్యమన్నకాలనీలోని ఓ గల్లీలో మట్టిరోడ్డు..


కోయనగర్‌లో ధ్వంసమైన డ్రెయినేజీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 17వ వార్డు పరిధిలో సగం మట్టిరోడ్లే దిక్కయ్యాయి. అక్కడక్కడా డ్రెయినేజీలు ధ్వంసమయ్యాయి. దొడ్డలోనిపల్లిలోని మసీదు పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలోకి చుట్టుపక్కల ఇళ్ల నుంచి మురుగంతా వచ్చి గుంటలా తయారైంది. దీంతో దోమలు పెరిగి తరచూ రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కోయనగర్‌లో పాత మోరీలే ఉన్నాయి. వారం రోజులకోసారి పారిశుద్ధ్య కార్మికులు వచ్చి శుభ్రం చేస్తున్నా చెత్త సరిగా తీయరని ప్రజలు చెబుతున్నారు. మొదటి గల్లీలో సీసీరోడ్డుతో పాటు డ్రెయినేజీ ధ్వంసమైంది. మురుగు ముందుకు కదిలే పరిస్థితి లేదు. దొడ్డలోనిపల్లిలోని బొడ్రాయి సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మూడు రోజులకోసారి మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీరు వస్తున్నా సరిపోదంటున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి, శివాలయం వద్ద రోడ్డు పక్కన ఉన్న పెద్ద రాళ్లను తొలగించాలని కోరుతున్నారు. పిల్లలమర్రి రోడ్డు నుంచి కల్లు దుకాణం వెళ్లే మార్గం మొత్తం కంకర తేలింది. అక్కడి వీధితో పాటు మసీదు పక్కన డ్రెయినేజీలు, సీసీరోడ్లు నిర్మించలేదు. సత్యమన్నకాలనీలో సుమారు 300 ఇళ్లు ఉంటాయి. అంగన్‌వాడీ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్క గల్లీలో డ్రెయినేజీ నిర్మించినా మట్టిరోడ్డే దిక్కయింది. ఇక పిల్లలమర్రి రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలో పట్టణానికి విసిరేసినట్టు ఎర్రవల్లితండా ఉంది. ఈ కంకర రోడ్డుకు ఇరువైపులా ఇటుక బట్టీలు పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. కనీసం 20 ఫీట్ల లోతులో కనిపిస్తాయి. సాయంత్రమైతే చాలు వాటి నుంచి దట్టమైన పొగ కమ్ముకుంటుంది. ఇక్కడ సుమారు 150 ఇళ్లు ఉండగా అంగన్‌వాడీ స్కూల్ ఎదుట మురుగును తొలగించకపోవడంతో అపరిశుభ్రంగా తయారైంది. ఈ తండాలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించినా నెలకోసారి పారిశుద్ధ్య కార్మికులు వచ్చి శుభ్రం చేస్తున్నారని తండావాసులు ఆరోపిస్తున్నారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. మిషన్ భగీరథ పథకం నుంచి సరఫరా అయ్యే నీరు ఒండుగా ఉండటంతో తాగడం లేదన్నారు. పవర్ బోరు నుంచి తెచ్చుకుంటున్నామన్నారు. హనుమాన్ టెంపుల్ వద్ద ఉన్న మరొకటి 8 నెలల నుంచి పనిచేయడం లేదన్నారు. ఇక పిల్లల మర్రికి పక్కనే హనుమాన్‌తండాలో సుమారు 50 ఇళ్లు ఉంటాయి. చుట్టుపక్కల పొలాల్లో పదుల సంఖ్యలో వెలసిన ఇటుక బట్టీలకు తరచూ టిప్పర్లు, ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నాయి. దీంతో తండాలోని సీసీరోడ్డుపై ఇంచు మేర మట్టి పేరుకుపోయింది. వర్షం వస్తే అంతా బురదలా మారి నడవలేని పరిస్థితి నెలకొంటుంది. దుమ్ము, ధూళి ఇళ్లలోకి వస్తోందని తండావాసులు వాపోతున్నారు. ఇటుక బట్టీల నుంచి దట్టమైన పొగ కమ్ముకుని ఇళ్ల వరకు రావడంతో తరచూ రోగాల బారిన పడుతున్నామని ఆరోపిస్తున్నారు. పిల్లలమర్రి కాంపౌండ్ వాల్‌ను అనుసరించి ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఎక్కడికక్కడ గుంతలు పడ్డాయి. మిషన్ భగీరథ పథకం పైపులైన్ పగిలినప్పుడు తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని తండావాసులు చెబుతున్నారు. ఉన్న ఒక్క పవర్ బోరు పనిచేయడం లేదన్నారు. రెండు విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నెల రోజులకోమారు పారిశుద్ధ్య కార్మికులు వచ్చి రోడ్లు ఊడుస్తున్నారని తెలిపారు.

మురుగు తొలగించాలి



మేము పిల్లలమర్రి రోడ్డు పక్కనే సుమారు 16 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. మూడేళ్ల నుంచి మసీదు పక్కన ఉన్న ఖాళీ ప్రదేశం అంతా మురుగు గుంటగా తయారైంది. సమీపంలోని ఇళ్ల యజమానులు మోరీలు నిర్మించుకోకుండా, పైపులు వేయకుండా మురుగును బయటకు వదులుతున్నారు. దోమలకు ఆవాసంగా మారి మాకు రోగాలు వస్తున్నాయి. దీనిని తొలగించాలని కౌన్సిలర్‌కు చెప్పినా ప్రయోజనం దక్కలేదు.

– హనీఫా, పిల్లలమర్రిరోడ్, దొడ్డలోనిపల్లి

అధ్వానంగా రోడ్డు..



బీసీకాలనీ నుంచి మా తండా వరకు కిలోమీటరు దూరం రోడ్డు అధ్వానంగా తయారైంది. సమీపంలోనే ఇటుక బట్టీలు ఉండటంతో టిప్పర్లు, ట్రాక్టర్లు ఎక్కువగా మట్టిని తరలిస్తున్నాయి. కంకర రోడ్డు మొత్తం గుంతలు పడ్డాయి. కాలినడకన పట్టణానికి వెళ్లాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంది. తండాలోని రెండు గల్లీలలో మట్టిరోడ్లను సీసీగా మార్చాలి. దోమల నివారణకు మందు కొట్టడం లేదు. కుక్కల బెడదతో చిన్నపిల్లలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

– సుక్కిబాయి, గృహిణి, ఎర్రవల్లితండా

సమస్యలను పరిష్కరిస్తాం

మా వార్డులో ఇప్పటివరకు రూ.50 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. ఏడాది క్రితమే రూ.23 లక్షలతో ఎర్రవల్లి తండా వరకు కంకర రోడ్డు వేయించాం. దొడ్డలోనిపల్లిలోని రెండు గల్లీలలో రూ.10 లక్షలతో సీసీరోడ్లు నిర్మిస్తాం. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో ఇటీవలే సుమారు రూ.కోటి మంజూరయ్యాయి. వార్డులో మిగిలిపోయిన పనులను ఈ నిధులను వెచ్చించి పూర్తి చేయిస్తాం. అన్ని సమస్యలను వీలైనంత వరకు పరిష్కరిస్తాం.

– ఏ.జంగమ్మ, కౌన్సిలర్, 17వ వార్డు

క్లుప్తంగా

1నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

గండేడ్: మండలంలోని మన్సూర్‌పల్లిలో సోమవారం నుంచి లక్ష్మీచెన్నకేశవ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 9గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, పంచగవ్యలచే శుద్ధి జలాధివాసము, ప్రదోశపూజ, మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మంగళవారం పంచామృతాభిషేకం, నవగ్రహ హోమం, 108 కలశములచే మహాస్నానము, పల్లకీ సేవ, ధాన్యాదివాసములు ఉంటాయి. బుధవారం ఉదయం 4:45 గంటలకు ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ట, నేత్రోచ్ఛారణం, బలిప్రసవం, పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేస్తున్నట్లు వివరించారు.

బొడ్రాయి ఉత్సవాలకు విరాళం

బాలానగర్: సూరారం గ్రామంలో బొండ్రాయి పండుగకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుద్‌రెడ్డి అందించిన రూ.50 వేల విరాళాన్ని శనివారం దుష్యంత్ రెడ్డి సర్పంచ్ పులమోని నర్సింహులుకు ఇచ్చారు. కార్యక్రమంలో లింగం, నారాయణరెడ్డి, శ్రీశైలం, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు గన్నీ బ్యాగుల సరఫరా

మహమ్మదాబాద్: వరి ధాన్యం సేకరణకు ప్రభుత్వం గన్నీ బ్యాగులను కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసింది. శనివారం మండల కేంద్రంతో పాటు కంచన్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి, మొకర్లాబాద్, నంచర్ల, గాధిర్యాల్‌కు అందించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు.

ఆర్‌ఐకి ఫిర్యాదు

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లి శివారులో ప్రైవేట్ పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ భూమిని ఆక్రమించిందని సర్పంచ్ శంకరప్ప తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ వెంకట్‌రెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 38లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు.

పనులను అడ్డుకుంటే సహించం



చిన్నచింతకుంట: రోడ్డు పనులను అడ్డుకుంటే సహించేది లేదని గూడూర్ సర్పంచ్ కాంతరావు హెచ్చరించారు. మండలంలోని కురుమూర్తి స్వామి ఆలయం నుంచి గూడూర్ వరకు వేస్తున్న బీటీరోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి ఎన్నో ఏళ్లుగా బీటీ రోడ్డు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. కొందరు స్వార్థ రాజకీయ నాయకులు కమీషన్లకు కక్కుర్తిపడి పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డాడు. అలాంటి వారికి గ్రామస్తులతో కలిసి తగిన బుద్ధి చెబుతామన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 3వ వార్డులో శనివారం సీసీరోడ్డు పనులను చైర్‌పర్సన్ లక్ష్మి ప్రారంభించారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలని, అలాగే రోడ్డు పూర్తయ్యాక క్యూరింగ్ చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక, కలప అక్రమ రవాణాను అడ్డుకోండి

మహమ్మదాబాద్: అనుమతులు లేకుండా అటవీ ప్రాంతం నుంచి ఇసుక, కలప తరలిపోతుండటంతో అటవీశాఖ సిబ్బందిపై డీఎఫ్‌ఓ సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మహమ్మదాబాద్ రేంజ్ అటవీ పరిధిని పరిశీలించారు. అటవీ పరిధిలో మొక్కలు, చెట్లను చూశారు. వన్య ప్రాణులను కొందరు వేటాడి తరలిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. సిబ్బంది అటవిని కాపాడుకునేందుకు పకడ్బందీగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విలువైన కలపను తరలించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యం రాత్రి వేళలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మహమ్మదాబాద్ రేంజ్ అధికారి మగ్దూమ్‌హుస్సేన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోట, మద్దూర్ గ్రామాల ఊక చెట్టు వాగు నుంచి శనివారం తెల్లవారుజామున ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. లాల్‌కోటకు చెందిన బోయ రమేష్, ఊకచెట్టు వాగు నుంచి మరికల్ మండలానికి, అమరచింత మండలానికి చెందిన గోపాల్‌రెడ్డి మద్దూర్ ఊకచెట్టు వాగు నుంచి అమరచింతకు ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు, భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం దేవతామూర్తులకు అభిషేక పూజలు, హోమం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో స్వామివారి రథోత్సవం చేపట్టారు. ఇందులో కళాకారుల అడుగుల భజన అలరించింది. ఆదివారం దేవతామూర్తుల పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి తదితర పూజలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

భజన బృందాలకు బహుమతులు

గురుపూజోత్సవాలను పురస్కరించుకొని దేవస్థానం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రామలింగేశ్వరస్వామి భజన మండలి (బండమీదిపల్లి) ప్రథమ, శివాంజనేయ భజన మండలి (కొండాపూర్) ద్వితీయ, శివమారుతి భజన మండలి (అప్పన్నపల్లి) తృతీయ, పెద్ద శివాలయం భజనమండలి (వీరన్నపేట) నాల్గవ స్థానంలో నిలవగా వీరికి నగదు బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఉత్తమ హార్మోనియం, ఉత్తమ తబల, ఉత్తమ గాయకులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

అలరించిన నాటక ప్రదర్శన


నాటకంలోని ఓ సన్నివేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: జనతా సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లక్ష్మీనగర్‌కాలనీలోని మాతా రాజరాజేశ్వరి దేవాలయం ప్రాంగణంలో శనివారం రాత్రి ప్రదర్శించిన 'శ్రీభద్రాద్రి రామదాసచరితం భక్తిరస నాటక ప్రదర్శన అలరించింది. వరకవుల నరహరిరాజు రచన, సంగీతం, దర్శకత్వంలో నాటక ప్రదర్శన నిర్వహించగా పాత్రధారులు చక్కటి అభినయంతో ఆకట్టుకున్నారు. సంకీర్తనాచార్యుడు భక్తరామదాసు జీవిత చరిత్ర ఆధారంగా నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం వరకవుల నరహరిరాజు, కళాకారులను ఘనంగా సన్మానం చేశారు. నాటక ప్రారంభోత్సవంలో డీఆర్‌డీఓ యాదయ్య, రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు భూషణ్‌పాండే, రవీందర్, జన్ను సత్యనారాయణ, గన్నోజు చంద్రశేఖర్, తిరుమల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి


గండేడ్‌లో శిబిరంలో కూర్చున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు


మిడ్జిల్‌లో..

గండేడ్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెండో రోజు సమ్మెను కొనసాగించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరసనలో పాల్గొన్నారు. వారి పిల్లలను సైతం సమ్మెకు తీసుకువచ్చి దీక్షలో కూర్చున్నారు. ఏళ్ల తరబడి గ్రామాల్లో అభివృద్ధికి తోడ్పాటునందిస్తే అవార్డులు మాత్రం కొట్టేసి తమ భవితను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెలో కలీమ్, రవి కుమార్, వెంకట్రాములు, శోభా, మంగమ్మ, ప్రవళిక, హాజీ, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న కార్యదర్శులకు, వీఓలకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం నిరుపేదల జీవితాలతో చెలగాటం ఆడుకోవడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో జగన్, మహిమూద్, ఇమ్రాన్, మధు, ఖలీల్, లాలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన శాంతియుత సమ్మె శనివారం రెండో రోజు కొనసాగింది. ఇప్పటికైనా స్పందించి 9,355 మంది కార్యదర్శుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేడే విజయవంతం చేద్దాం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు నర్సింహులు, దాసు, శేఖర్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో మేడేను ఘనంగా నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దేవదానం, చంద్రన్న, కోళ్ల వెంకటన్న తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని కార్మికులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండల కేంద్రంలో శనివారం మేడే పోస్టర్‌ను ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాలకు అందుతున్న వేతనాలతో జీవనం గడవడం కష్టంగా మారిందన్నారు. మేడే స్ఫూర్తితో కార్మికుల కనీస వేతనాలు పెంపుదలకై, సామాజిక భద్రతకై, పనిగంటల తగ్గింపు కోసం పోరాటం చేయాలని సూచించారు. మన్యం, లక్ష్మన్న, బుచ్చన్న, కతలన్న పాల్గొన్నారు.

శోభాయమానంగా కలశాల ఊరేగింపు


కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

జడ్చర్ల టౌన్: వాసవీమాత జయంతిని పురస్కరించుకుని శనివారం రాత్రి వాసవీ, వనితాక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన 108 కలశాల ఊరేగింపు శోభాయమానంగా సాగింది. నిమ్మబావిగడ్డ హనుమాన్ దేవాలయం వద్ద కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళ తాళాలు, డీజే పాటలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ఊరేగింపు చేసి ఆలయంలో వాటిని ఉంచారు.

గేర్‌బాక్స్ ఎత్తుకెళ్లిన దుండగులు

మహబూబ్‌నగర్ క్రైం: కొన్ని రోజులుగా ఒకే చోట నిలిపిన బొలెరో వాహనం గేర్‌బాక్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. టూటౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ సాధిక్ తన బొలెరో వాహనాన్ని కొన్ని రోజులగా మోనప్పగుట్ట ఏరియాలోని మాద్రస్ టెంట్‌హౌస్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిలిపాడు. ప్రతి రోజు వాహనం చూసుకునేవాడు. ఈనెల26న మధ్యాహ్నం సమయంలో వాహనం పరిశీలించగా గేర్‌బాక్స్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. చోరికి గురైన గేర్‌బాక్స్ విలువ దాదాపు రూ.75వేలు ఉంటుందని, బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అకాల వర్షానికి.. పంటలు నష్టం

మహమ్మదాబాద్: అకాల వర్షంతో ఆయా గ్రామాల రైతులు ఎంతో నష్టపోయారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంతో పాటు, వెంకట్‌రెడ్డిపల్లి, మొకర్లాబాద్, నంచర్లలో వందలాది ఎకరాల్లో వరిపంట నేలకొరిగి ధాన్యం నేలరాలింది. ఆరుగాలం శ్రమించి పండించిన వరిధాన్యం చివరి కోత దశలో చేతికందే సమయంలో అనుకోకుండా కురిసిన వర్షానికి దాదాపు వందల ఎకరాల్లో 10 నుంచి 20 శాతం ధాన్యం నేలపాలైనట్లు రైతులు తెలిపారు. గాలివానకు మామిడి కాయలు నేలరాలాయి. వర్షం కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని రైతులు డిమాండ్ చేశారు.


మహమ్మదాబాద్‌లో నేలవాలిన వరి పంటను చూయిస్తున్న రైతులు

రాజారవివర్మ జయంతి

స్టేషన్ మహబూబ్‌నగర్: స్ఫూర్తి సామాజిక సేవా కళా సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని పాత గౌతమి డిగ్రీ కళాశాల మహేష్ ఆర్ట్స్ అకాడమీలో ప్రఖ్యాత చిత్రకారుడు రాజారవి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ భారతీయ గొప్ప చిత్రకారుడు రాజారవి వర్మ అని కొనియాడారు. అనంతరం చిత్రకారుడు జేపీ మహేష్‌కుమార్‌ను సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, వీరాంజనేయులు, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఏఎంసీగా వెంకటేశ్వరరావు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు ఇన్‌చార్జ్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ)గా నియమితులయ్యారు. కమిషనర్ ప్రదీప్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు ఏఎంసీగా వ్యవహరించిన శంకర్‌సింగ్ ఈనెల 10న తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది.

పౌర హక్కులపై అవగాహన

దేవరకద్ర రూరల్: రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ శివరాజ్ అన్నారు. పౌరహక్కుల దినం సందర్భంగా శనివారం పెద్దరాజమూర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఇబ్బందులు రాకుండా కొనుగోళ్లు



అడ్డాకుల: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ సూచించారు. మూసాపేట మండలం నిజాలాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోళ్లను వేగంవంతం చేయించాలని సిబ్బందికి సూచించారు. రైతులు తగిన విధంగా తేమ శాతం ఉండేలా చేసుకుని ధాన్యాన్ని విక్రయించాలని చెప్పారు.

నిరుద్యోగ ర్యాలీకి తరలిరండి

నవాబుపేట: జిల్లా కేంద్రంలో నిర్వహించే కాంగ్రెస్ నిరుద్యోగ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఆదివారం చేపట్టే ర్యాలీలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో బంగ్లరవి, రాజేష్, రాంచంద్రయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

అడ్డాకుల: జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని అడ్డాకుల, మూసాపేట మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగిరెడ్డి, శెట్టిశేఖర్ ప్రకటనలో కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరయ్యే కార్యక్రమానికి నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

జడ్చర్ల టౌన్: జవహర్ నవోదయ పరీక్ష మండలంలో శనివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణం, బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో బాదేపల్లి హైస్కూల్‌లో 168మంది విద్యార్థులకు 18మంది గైర్హాజరయ్యారు. పట్టణంలోని హైస్కూల్‌లో 149మంది విద్యార్థులకు 119 మంది హాజరయ్యారు.

వీఓఏల సమ్మె

జడ్చర్ల టౌన్: మండల పరిషత్ కార్యాలయం వద్ద వీఓఏలు చేస్తున్న సమ్మె శనివారం 13వ రోజు కొనసాగింది. సమ్మెలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య మాట్లాడుతూ మునుగోడు ఎన్నికల సమయంలో వీఓఏలకు నెలకు రూ.10,500 వేతనం చేస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఎన్నికలు ముగియగానే విస్మరించారన్నారు. వెంటనే ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఉన్నప్పటికీ సీసీలు, ఏపీఎంలు పనికి రావాలని ఒత్తిడి తీసుకురావటం సరికాదన్నారు. రమేష్, వాసియాబేగం, రమాదేవి, అలివేల, మహేశ్వరి, సాలమ్మ, స్వప్న పాల్గొన్నారు.